Amn-e-Aalam
(Telugu)

లోకశాంతి

రచన

జలాలుద్దీన్ యూసుఫీ

కరుణించేవాడు, కనికరించేవాడు అయిన అల్లాహ్ పేరుతో

సోదరులారా!

ఈ విశ్వంలో మనం అనేక సృష్టితాలను చూస్తున్నాం. మన దృష్టిని వినీలాకాశం వైపునకు సారిస్తే సూర్యుడు, చంద్రుడు నక్షత్ర సమూహం దర్శనమిస్తాయి. అదే విధంగా భూమ్మీద చీమలాంటి అతి స్వల్పజీవి మొదలుకొని మహోన్నత పర్వతాల వరకు సృష్టింపబడి ఉన్నట్లు మనం చూడగలం. ఇవన్నీ క్రొత్తగా ఈ రోజునే సృష్టించబడలేదు. వేనవేల సంవత్సరాల నుండే ఇవన్నీ సృష్టించబడి ఉన్నాయి. ఇవన్నీ తమను సృష్టించిన ఆ సృష్టికర్త నియమించిన నియమాలకు, అంటే ప్రకృతి సిద్ధాంతాలకు లోబడి మసలుకుంటున్నాయనటంలో సందేహం ఏమాత్రం లేదు.

సృష్టికర్త – విధేయత

ఉదాహరణకు సూర్యుణ్ణే తీసుకుందాం. భూభ్రమణం వలన సూర్యుడు మనకు తూర్పున ఉదయించి పడమర గ్రుంకునట్లు కనబడుతున్నాడు. అలా ఉదయించటం అస్తమించటం ఏ ఋతువులో ఏ మార్గంలో జరగాలని దైవం నిర్ణయించాడో అజ్ఞాత కాలం నుండి అది అలాగే సంచరిస్తోంది. దాని ప్రయాణంలో ఎలాంటి మార్పు లేదు. అదే విధంగా భూమిపై ఉన్న నీటిని చూడండి. దానికి దాని సృష్టికర్త ఏర్పరచిన నియమాల్నే అది అవలంబిస్తూ ఉంది. అది ఏ ఏ విధంగా ఉపయోగపడాలో అలా ఉపయోగపడుతూనే ఉంది. సూర్యచంద్రాదులు, గ్రహాలు, ఉపగ్రహాలు అన్నీ తమ తమ కక్ష్యలను వెంట్రుకవాసి కూడా తప్పడం లేదు. ఒక గ్రహం ఇంకో గ్రహంతో ఢీకొనడంగాని, భూమండలం మరో గ్రహంతో ఘర్షించడంగాని జరగటం లేదు. అలాగే

ప్రపంచంలోని ప్రతి వస్తువు తన సృష్టికర్తకు బానిసగా తన విధేయతను చూపుతోంది. దీన్నిబట్టి ఈ లోకాన్నంతటినీ ఒకే సృష్టికర్త సృజించాడని తేలిపోతుంది. అలాకాక ఒకరికంటె ఎక్కువ మంది సృష్టికర్తలు దీన్ని సృష్టించి ఈ లోకాన్ని ఏలితే ప్రస్తుతం మనం చూచే ఈ సృష్టి విధానమే మారిపోయేది. యుగాలకు యుగాలే గడిచినా ప్రపంచ చక్రం ప్రశాంతంగా తిరుగుతూనే ఉంది.

మన దృష్టిని ఈ విశ్వంపై నుండి మరల్చి దాన్నికాస్త మన సొంత శరీరంపైనే కేంద్రీకరిద్దాం. మన కళ్ళు, మన చెవులు, మన ముక్కు, నోరు అన్నీ వాటి సృష్టికర్త ఏర్పరచిన చట్టాలకనుగుణంగానే పనిచేస్తున్నాయి. అంటే సృష్టికర్త, కళ్ళను చూడటానికే సృష్టించాడు. అయితే ఆ కళ్ళు తమ బాధ్యతనే నిర్వహిస్తాయి. కాని మాట్లాడటానికో వినటానికో ఏనాడు ప్రయత్నిం చవు. అలానే కాళ్ళు నడవటానికే వున్నాయి. అలాకాక అవి మాట్లాడటానికి ప్రయత్నిస్తాయా? అనగా ప్రపంచంలోని ప్రతి వస్తువు దాన్ని సృష్టించిన ఆ ఏకైక సృష్టికర్త ఏర్పరచిన ప్రకృతి సిద్ధాంతాలకు విధేయత చూపుతున్నందు వల్లనే ఈ సృష్టి ప్రశాంతంగా నడుస్తున్నది. ఇలా ప్రశాంతంగా నడుస్తున్న ఈ సృష్టిలో స్వయంగా మానవుడు కూడా ఒక సృష్టియే. ప్రపంచంలోని చిన్నా పెద్దా ప్రతి వస్తువు, భూగర్భంలో నిక్షిప్తమయి ఉన్న ఖనిజ సంపద, సూర్యుడు, చంద్రుడు, గాలి, నీరు, సమస్త వస్తుసముదాయం ఈ మానవునికి ఉపయోగబడటానికే సృష్టించబడ్డాయి. మానవుని కోసమే సృష్టించబడి, ఒక నిర్ణీత మార్గాన్నే అనుసరిస్తూ మానవ సేవలోనే సదా నిమగ్నమయి ప్రశాంతంగా సాగుతున్న ఈ సృష్టిలో మానవ జీవితమే అశాంతి పాలయి పోయింది. మానవ జీవితంలో "శాంతి" అనేదే కరువయిపోయింది. మానవజాతి ఖండ ఖండాలుగా, వర్గాలుగా చీలిపోయి, విభిన్న పేర్లను పెట్టుకొని, ఒక జాతి

ఇంకో జాతితో, ఒక దేశం ఇంకో దేశంతో ఒక తెగ, ఇంకొక తెగతోను, ఒక వర్గం మరో వర్గంతోను సంఘర్షించుకోవడం మనం కళ్ళారా చూస్తూనే ఉన్నాం. ఆకాశానగల గ్రహాలు, నక్షత్రాలు పరస్పరం ఘర్షించుకోనప్పుడు మానవుల ఓ వర్గం మరో వర్గంతో ఘర్షించుకోవడం మూలాన శాంతి అనేది ఎలా కరువవుతున్నదో గమనించండి.

అశాంతికి కారణం?

ఈ అశాంతి మనదేశంలోనే కాదు, ప్రపంచం మూలమూలల్లోను ఈ పరిస్థితే ఏర్పడింది. మానవ జీవితంలో అశాంతి ఏర్పడటానికి అసలు కారణం ఏమిటి? ఈ అశాంతిని పారద్రోలి తిరిగి శాంతిని ఎలా స్థాపించాలి? ఈ ప్రశ్నలు కేవలం ఒక జాతికి, ఒక తెగకు లేక ఒక దేశానికి సంబంధించినవి కావు. వీటిని ఇలా ఆలోచించటమే పొరపాటు. కాబట్టి మేము ఈ ప్రశ్నను ఒక జాతి లేక ఒక తెగవారి యెదుటనే కాదు; హిందువులు, ముస్లిములు, భారతీయులు, చైనీయులు, సర్వమానవాళి ఎదుట పెట్టదలిచాము. కాబట్టి దీన్ని మీరు ఒక జాతి లేక తెగ సమస్యగా భావించక సర్వమానవ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తారని ఆశిస్తున్నాం. మీరు పరిశీలించే ఈ పరిశీలనలో లోకకళ్యాణం దాగి ఉంది అని మనవి చేస్తున్నాం.

ప్రపంచంలోని మహాపురుషులు, మేధావులు, మానవజాతి యొక్క ఈ దుస్థితిని దూరం చేయటానికి అనేక మార్గాలు అన్వేషించారు. పలువిధాలయిన సూత్రాలను కనుగొని వానిని అవలంబించే ప్రయత్నాలు చేశారు. కాని వ్యాధి యొక్క అసలు కారణం దృష్టిలో లేనందువల్ల వీరు ప్రవేశపెట్టిన ఏ ఒక్క సిద్ధాంతం, ఏ ఒక్క సూత్రం వల్ల ఈ గడ్డు పరిస్థితి తొలగ లేదు సరికదా కొంగ్రొత్త ఇక్కట్లు వచ్చిపడ్డాయి. ఇలా ఆలోచించేవారిలో కొందరు,

ఈ అశాంతికి మూలకారణం బీదరికం ఒక్కటేనని, కూడూ, గుడ్డ సమృద్ధిగా లభిస్తే సంపూర్ణ శాంతి ఏర్పడుతుంది అని అభిప్రాయపడ్డారు. ఈ కూడూ గుడ్డ కొరతకు మానవుల కష్టాలకు ఎలాంటి సంబంధంలేదని నేను అనను. కాని ఈ ఒక్క కొరతే అశాంతికి కారణం అని మాత్రం నేను చెప్పజాలను. కూడూ, గుడ్డ సమృద్ధిగా ఉండి, ధనంతో తులతూగే అనేక దేశాలు సయితం ఎన్నో గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తోంది. ఆ దేశాల్లో అశాంతి ప్రబలటాన్ని మనం నిత్యం గమనిస్తూనే ఉన్నాం. ఇట్లయినప్పుడు పేదరికం ఒక్కటే అశాంతికి కారణమని మనం ఎలా చెప్పగలం?

విద్య కొరత మూలంగానే మానవుల్లో అశాంతి ఏర్పడిందని కొందరి భావన. కాని విద్యా వివేకాల్లో ముందంజవేసి నూటికి తొంభయి మంది విద్యావంతులయిన దేశాల్లో సయితం ఎంత అశాంతి ప్రబలిందో ఆలోచించండి. వారి విద్యా విజ్ఞానాలు వారి ఈ అశాంతిని పారద్రోలటానికి ఏమాత్రం తోడ్పడటం లేదు. అందువల్ల విద్యా కొరతే అశాంతికి కారణమని ఎలా నమ్మగలం?

ఇదే విధంగా మతం అన్నదే మానవ జాతి అశాంతికి మూల కారణమని, ఈ మతంపై గల నమ్మకాలే మానవ జీవితం నుండి తొలగిపోతే పూర్తిగా శాంతి ఏర్పడుతుంది అని ఇంకా కొందరి ఊహ. ఈ ఊహ ఎంత మట్టుకు యదార్థమో యోచిద్దాం. ఇప్పటికే ప్రజల్లో మత విశ్వాసాలు చాలావరకు సన్నగిల్లాయి. అందువల్ల మేలు కలగటానికి బదులు ఎంతహాని కలుగుతుందో మనం గ్రహించలేమా? మత విశ్వాసాలు లేనప్పుడు మానవుల్లో ప్రేమ అనేది పూర్తిగా నశించిపోతుంది. మానవుల్లో తోటి మానవుల ఎడల ప్రేమానురాగాలే ఉంటే జరిగిన ఈ ప్రపంచ మహాయుద్ధాలు జరిగేవా? ఈ యుద్ధాలు ఏ మతాభిమానుల మూలంగా జరిగాయి? ఆ యుద్ధాల్లో జరిగిన

ఘోరాలకు కారణం మత విశ్వాసమేనా? అలా ఎన్నటికీ కాదు. అయితే మరి ఈ మానవ అశాంతికి కారణం ఏమిటి?

అశాంతి నివారణలు

పైన పేర్కొన్నట్లు, ఈ ప్రపంచానికి సృష్టికర్త ప్రపంచంలోని అన్ని సృష్టితాలను సృష్టించి, మానవుని జీవితానికిగాను ఎలాంటి నియమాలను ఏర్పరచలేదని, ఈ లోకంలో మానవుడు తన కోరికల్ని నెరవేర్చుకోడానికి సంపూర్ణ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పొంది ఉన్నాడని ఏర్పడిన భావమే ఈ అశాంతికి మూలకారణం.

ఈ విధంగా భావించడం మూలాన్నే, ప్రతి వ్యక్తి, ప్రతి దేశం, ప్రతి వర్గం, ప్రతి తెగకు సంబంధించిన మానవులంతా తమ ఇష్టానుసారం, తమకు తోచినవాటిని తమ వ్యక్తిగత సాంఘిక జీవనం యొక్క సూత్రాలుగా స్వీకరించి సుఖంగా జీవించదలిచారు. ఈ దృష్టితో మానవులు వ్యక్తిగతంగా సాంఘికంగా ఏర్పరచుకున్న సూత్రాలను సవివరంగా పరిశీలిద్దాం.

ఇలాంటి సాంఘిక జీవిత సూత్రాలలో "సెక్యులరిజం" ఒకటి-అంటే సాంఘిక జీవితంలో దైవ విశ్వాసం మరియు మత విశ్వాసానికి తావులేదు; దైవభక్తి మరియు మతవిశ్వాసాలు దేవాలయాల్లోను, మస్జిదుల్లోను మరియు మతానికి సంబంధించిన ఆచారాల్లోను, మనుషుల వ్యక్తిగత జీవితంలో మాత్రమే చెల్లుతాయి; కాని సామూహిక జీవితంలో మాత్రం దైవానికి దైవచట్టాలకు దైవ విశ్వాసాలకు ఎట్టి తావులేదు అని అర్థం. ఈ "సెక్యులరిజం" అనే సూత్రం సత్యానికి ఎంత దూరమైందో ఆలోచించారా? ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో దేవుణ్ణి నమ్మి దైవాదేశాలనే అనుసరిస్తూ; సాంఘిక జీవితంలో మాత్రం దేవుణ్ణి కాదని తన ఇష్టానుసారం సామూహిక నియమాలు

నిర్మించుకోవడం, వాటి ప్రకారమే జీవితం గడపటంలో ఏమైనా అర్థం ఉందా? ఇలాంటి వ్యవస్థ (సెక్యులర్ సిస్టం)లో చట్టాలను తయారు చేసే అధికారంగల శాసన నిర్మాతలు, పాలక వర్గం, పరిపాలనా యంత్రాంగంలోని వ్యక్తులు, కుటుంబం, కులం, మతం, వర్గంలాంటి వాటిపట్ల దురభిమానాలకు లోనుకాకుండా వ్యవహరించగలరా? ఇలాంటి దురభిమానాలకు మన సామూహిక వ్యవస్థలోని అన్ని రంగాలవారూ గురయినట్లు మన నిత్య అనుభవంలో వచ్చే విష యాలే. ఏ వర్గానికి ఏ మేరకు అధికారం లభించినా అది అంతవరకూ ఈ దురభిమానాలను ఆచరణలో పెట్టడం కూడా మనం చూస్తూనే ఉన్నాము.

ఇలా మానవులే సొంత ఆలోచనలతో ఏర్పరచుకున్న సామూహిక జీవితం యొక్క మరొక సూత్రం "నేషనలిజం" (Nationalism), అంటే "స్వజాత్యాభిమానం" అని అర్థం. ఒక వ్యక్తి తన జాతిని ప్రేమించడంలో తప్పులేదు. కాని ఆ జాత్యాభిమానం మితిమీరినప్పుడు మనిషి తన జాతికి మేలు చేకూర్చడానికి ఇతర జాతికి కీడు తలపెట్టే ప్రమాదం వాటిల్లుతుంది. అందులో ఎలాంటి సందేహమూ లేదు. ఐక్యరాజ్య సమితి (U.N.O.) లో చేరిన వివిధ జాతుల ప్రతినిధులు తమ తమ జాతుల మేలుకోసం ఇతర జాతుల న్యాయమయిన కోరికల్ని ఎలా భంగపర్చ ప్రయత్నిస్తున్నారో మనం చూస్తూనే ఉన్నాం కదా!

లోకంలోని అశాంతిని పారద్రోలి సుఖ జీవనం జరపతలచి ప్రజలు ఏర్పర్చుకున్న మూడవ సూత్రం "నియంతృత్వం" (Dictatorship) అంటే సర్వమానవాళి సుఖజీవనం కోసం సూత్రాల్ని, చట్టాల్ని నిర్మించే అధికారం ఒకే వ్యక్తికి ఇచ్చివేయడం అని. ఇది ఎంత అక్రమమయిన మార్గమో మనం సులభంగానే గ్రహించవచ్చు. ఒక దేశం యొక్క నియంత

"డిక్టేటర్" తన ప్రజలందరి నిత్యావసరాలు, వారి యదార్థ స్థితిగతులు, వారి న్యాయమైన కోరికలు, వారి తక్కిన అవసర విషయాల్లో పూర్తి అనుభవం, జ్ఞానం కలిగి ఉండాలి. అప్పుడే అతని ఆ నియంతృత్వం శాంతికి దోహదం కాగలుగుతుంది. అయితే ఇలాంటి సంపూర్ణ జ్ఞానం ఏ మానవునికీ లేదని నేను గట్టిగా చెప్పగలను. అలాంటి జ్ఞానం లేని ఒక వ్యక్తి చెప్పిందల్లా చట్టం అయితే మానవకోటికి ఎంతటి ప్రమాదం వాటిల్లుతుందో సునాయాసంగా ఆలోచించవచ్చు.

ఇంతేకాకుండా ఒక వ్యక్తి నియంత అయితే తన సొంత కులాభిమానానికి, తన సొంత మతాభిమానానికి, తన స్వలాభానికి తలవంచి నిరంకుశత్వంగా పరిపాలించే అవకాశం ఎంతైనా ఉంది. ఇలాంటి లోపాలుండే డిక్టేటర్‌షిప్ వల్ల శాంతి ఏర్పడటం అలా ఉంచి ఎలాంటి ప్రమాదం ఏర్పడుతుందో గమనించారా?

ఇక మరో సూత్రం "డెమోక్రసీ" (Democracy) దీన్నే మనం "ప్రజాస్వామ్యం" అంటున్నాం. ఈ ప్రజాస్వామ్యమే ప్రస్తుతం చాలా మంది దృష్టిలో శ్రేయస్కర మార్గంగా గుర్తు పొందింది. ఇందులో ఎంత మట్టుకు సత్యముందో పరిశీలిద్దాం. ఒకే ఒక వ్యక్తికి మానవుల శ్రేయస్సు కోసం సూత్రాలు నిర్మించే సర్వాధికారం ఇవ్వడం అంటే "నియంతృత్వం" ఎలా అసమంజసమయిన విధానమో, అలాగే వ్యక్తుల ఓ వర్గానికి అలాంటి అధికారాలు ఇవ్వటం కూడా అసమంజసమయిన విధానమే. వారు ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులే అయినా వ్యక్తులుగా వారిలోనూ ఆ లోటుపాట్లు ఉంటాయి.

ఒక వ్యక్తిలో ఉండే దోషాలే కొందరు వ్యక్తుల్లో కూడా ఉంటాయి. ఒక వ్యక్తి స్వయంగా ఆలోచించి, దాన్ని మంచిది అని తలచి ఒకనాడు చేసిన ఒక పనిని కొద్ది కాలం తర్వాత తానే స్వయంగా తప్పు అని భావించటం

మనం ఎరిగిన విషయమే. ఇదే విధంగా ఒక పాలకవర్గం ఒక విషయాన్ని గురించి మంచిదని, మేలయినది అని అనుకొని తదనుగుణంగా అమలుజరిపి ఆ తరువాత మనసు మార్చుకొని దానికోసం నిర్మించిన చట్టాల్నే రద్దుపరచడం మనం చూస్తూనే ఉన్నాం. ఉదాహరణకు ప్రజాస్వామ్యమైన అమెరికా ప్రభుత్వం ప్రజల వత్తిడిపై మద్యపానాన్ని చట్టపరంగా నిషేధించింది, కాని ఆ చట్టాన్ని గౌరవించి విధేయత జూపే ప్రజలేరి? చట్టం చట్టం లాగానే ఉండిపోయి యధాప్రకారం మద్యపానం సాగుతూ ఉండగా ఆ పాలక వర్గమే ఆ చట్టాన్ని మార్చి మద్యపానం చట్టవిరుద్ధం కాదు అని శాసించింది. ఒక విషయం కొంత కాలం చట్టవిరుద్ధమై ఇంకొంత కాలానికి చట్ట సమ్మతం అయినట్లు చేయడం మానవ తీర్పులోగల బలహీనతను సూచిస్తోంది. ఇదే కాకుండా అన్ని మతాల్లోను వ్యభిచారం అనేది అసహ్యాంపబడినదే. అలాంటి వ్యభిచారాన్ని గురించి మరొక దేశంలో పరిశీలన జరిపినప్పుడు వారు ఇచ్చిన తీర్పును చూడండిః "దౌర్జన్యపూరితంగా కాక స్త్రీ పురుషుల పరస్పరం ఇష్టంతో జరిగే వ్యభిచారాన్ని చట్టవిరుద్ధంగా ఎంచే కారణం ఏదీ కనిపించడం లేదు, కాబట్టి ఇలాంటి వ్యభిచారం చట్టవిరుద్ధం కాదు." అన్ని మతాల్లోను అంటే దైవశాసనాల్లో దూషించబడిన అపరాధంగా ఎంచబడిన ఈ వ్యభిచారాన్ని ఒక ప్రభుత్వం ఎలా దోషరహితమయినదిగా భావించిందో చూశారా? ఈ దైవశాసనాన్ని ధిక్కరించిన దేశంలో ప్రజా జీవితం ఎన్ని అవకతవకలకు ప్రమాదాలకు గురవుతుందో మీరు నిత్యం చూస్తూనే ఉన్నారు. ఇదేకాక డెమాక్రసీలో ప్రజా ప్రభుత్వం పేరుకు మాత్రమే ఉండి క్రమేపి ధనిక వర్గాల పాలనగా మారుతుంది. అలాంటి ధనికుల ధనాన్ని, వారి ఆదాయాన్ని ఏ ప్రభుత్వమూ అరికట్టలేకపోతుంది. కాని అలాంటి పాలనగల దేశంలోనే సామాన్య ప్రజానీకం ఆదాయమార్గాల్లో అవరోధాలు అమితంగా

సృష్టించబడతాయి, ఇలాంటి వారిని "కమ్యూనిజం" చేరదీసి, దేశీయ ధనాన్ని జాతీయం చేయటంలో మమ్మల్ని తోడ్పడమని కల్లబొల్లి కబుర్లు చెప్పి వారిని బుట్టలో వేసుకోచూస్తుంది. ఇలాంటి ప్రచారం వల్ల బీద ప్రజానీకంలో కమ్యూనిజం పట్ల ఒక విధమయిన విశ్వాసం ఏర్పడటంలో సందేహమేముంది? కాని చివరికి ఈ కమ్యూనిజం కూడా ప్రజాశ్రేయస్సుకు ఏ విధంగానూ తోడ్పడదని ఋజువుఅయింది. అయితే ఇలా అంటున్నామని మమ్మల్ని మీరు ధనిక వర్గం క్రింద జమ చేయొద్దు. హద్దూ పద్దూలేకుండా మితిమీరే ధనిక వర్గానికి మేమెన్నటికీ అనుకూలురం కాదు. ఐనా కమ్యూనిజాన్ని గూర్చి మేం చెప్పే కొన్ని ముఖ్యవిషయాల్ని కొంచెం ఆలకించండి.

కమ్యూనిజం కూడా...

ఈ కమ్యూనిజం అనేది కూడా లోకంలోని అశాంతిని తొలగించి, సుఖజీవనాన్ని గడపటానికి ప్రజలు ఏర్పర్చుకున్న ఇంకొక సూత్రం. ఇది కేవలం ధనిక వర్గంపై ద్వేషం మరియు కక్ష ఆధారంగా ఉత్పన్నమయిన సూత్రం మాత్రమే. ఇక్కడ ఒక విషయాన్ని ప్రత్యేకంగా గమనించాలి. అదేమిటంటే కమ్యూనిస్టు వ్యవస్థలో కూడా ధనికవర్గం, అధికార వర్గం అనేవి లేకుండా సర్వసమానత్వాన్ని సృష్టించడానికి కృషి చెయ్యడం కూడా మానవ ప్రకృతికి విరుద్ధమని గ్రహించాలి. కాబట్టి మానవ శాంతిశ్రేయాల కోసం ఇలాంటి మానవ ప్రకృతికి విరుద్ధమయిన సూత్రాలను అవలంబించటం, అమలుపర్చటం కేవలం అవివేకం. ధనికవర్గం, ధన సంపాదనలోను, దాని ఖర్చులోను; అధికారవర్గం, అధికార ప్రాప్తికి మరియు దాని వినియోగానికి ధర్మాన్ని, న్యాయాన్ని, సద్ప్రవర్తనను అవలంబించేలా చెయ్యాలి. వారిచేత అలా చేయించే సూత్రాలను కనిపెట్టాలి. కాని బీదప్రజానీకంలో ధనిక, అధికార వర్గాల ద్వేషాన్ని, వైషమ్యాన్ని ప్రబలింపచేసే ఎలాంటి ప్రజాశ్రేయస్సు

కూడా ఇనుమడించదు. ఇలాంటి సద్ప్రవర్తన ప్రజల్లో కలుగజేసేందుకు కమ్యూనిజం ఏ మాత్రం తోడ్పడటంలేదన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. అంతేకాక దేశ సంపదను జాతీయం చేయడం వల్ల ఆ ధనం ప్రభుత్వాధికారుల చేతుల్లో ఎలా చిక్కిపోతుందో, దాన్ని వారు ఏ విధంగా దుర్వినియోగం చేస్తారో కాస్త గమనించవలసి ఉంటుంది. వారు అలా చేసినా వారిని ఆక్షేపించటానికి ప్రజలకు ఎలాంటి అధికారమూ ఉండదన్న సంగతి కూడా తెలుసుకోవడం అవసరం. ఈ విధంగా కమ్యూనిజం మానవత్వానికి అనుకూలమయిన సూత్రం కాదని మనం సులభంగానే గ్రహించవచ్చు.

ఇక్కడ ఒక విషయం చెప్పటం ముఖ్యమని భావిస్తాను. 'ఇస్లాం'లో కూడా సమానత్వం ఉంది. కాని మనిషి సంపాదించిన ధనాన్ని పంచిపెట్టడంలో కాదు ఆ సమానత్వం. తన శక్తిసామర్థ్యాల ననుసరించి సంపాయించటానికి ప్రతి మనిషికి కావలసిన అవకాశాలను అందజేస్తుంది ఈ సమానత్వం. అంటే ధన సంపాదనకు మనిషి ఏ ధర్మసమ్మతమయిన మార్గం అనుసరించదలచినా అతనికి తగిన అవకాశం దొరకడం అన్నమాట. అలాగే ధన సంపాదనా మార్గం ఏదైనా దాన్ని ఏ వ్యక్తికీ ప్రత్యేకించకుండా అందులో యావత్తు ప్రజలకు సమానంగా అవకాశం కల్పించే సమాన హక్కును ఇవ్వడం అన్నమాట. అలా కాకుండా ఒకరి కృషి ఫలితాన్ని అందరికీ సమంగా అందజేయడం మానవ నైజానికే విరుద్ధం. ఒక మోటారు నడిపేవాని కృషి ఫలితాన్ని ఒక ఎడ్ల బండిని నడిపేవాని కృషి ఫలితానికి సమానమని అనటం, రెంటినీ సమంగా లెక్క కట్టడం ఏ విధంగా యదార్థ విరుద్ధమో, ఇంకా ఒక కాలేజీలో విద్యార్థులు పొందే మార్కుల మొత్తాన్ని ఆ కాలేజీలో చదువుకునే అందరు విద్యార్థులకు సమంగా పంచిపెట్టడం ఎలా తెలివి తక్కువతనానికి గుర్తో అదే విధంగా సకల ప్రజల కృషి ఫలితాలను సేకరించి వాటిని అందరికీ

సమంగా పంచిపెట్టడం కూడా అసమంజసం, వివేచనారహితం. సమానత్వం అంటే అది కాదు! ప్రతి విద్యార్థికి విద్యాభ్యాసంలో సమానహక్కును అవకాశాన్ని సౌకర్యాలను అందజెయ్యడమే! కాని వచ్చిన మార్కుల్ని అందరికీ కలిపి సమానంగా పంచిపెట్టడం కాదు!! అందుకనే కమ్యూనిజం సూత్రం ఎక్కువ కాలం ఆచరణలో ఉండలేదు. కమ్యూనిస్టు దేశాల్లో ఆ సిద్ధాంతంలో కాస్త సడలింపు ఇవ్వడం ప్రారంభమయింది.

ఇస్లామ్ ఆదుకుంటుంది

కాబట్టి సోదరులారా! మతరహిత తత్వం, జాతీయతత్వం, నియంతృత్వం, ప్రజాస్వామ్యం మరియు కమ్యూనిజం అనే ఈ అయిదు సిద్ధాంతాలను, ప్రజలు తమ శ్రేయోభిలాషతో నిర్మించుకుని అమలుపరచుకున్నారు. ప్రజలు తమకు 'సంపూర్ణ స్వేచ్ఛ-స్వాతంత్ర్యాలు' గలవని భావించటంచేతనే తమకు సుఖవంతమయిన జీవనాన్ని కోరి తమ ఇష్టం వచ్చినట్లు తమకు మేలుగా తోచిన ఈ సామూహిక సిద్ధాంతాలను నిర్మించుకున్నారు. అయితే ఈ సూత్రాలు మానవ జీవితంలో శాంతికి బదులు అశాంతిని ఎలా కలుగజేస్తున్నాయో గత పుటల్లో మనం గ్రహించగలిగాము. ఈ విషయాలన్నింటినీ పరిశీలించి మానవ సుఖ శ్రేయాల కొరకు కావలసిన జీవన సూత్రాలను మాకు ఉత్తమమయినవిగా తోచిన వాటిని సకల మానవాళి ఎదుట పెట్టదలిచాము. మతం, జాతి- తెగ, భాషా సంబంధమయిన దురభిమానాల్ని విడనాడి పరిశీలించమని మిమ్మల్ని కూడా కోరుతున్నాము.

మా దృష్టిలో ఇలాంటి సకల అశాంతులు తొలగించే మార్గం ఒక్కటే, అదే 'ఇస్లాం'. అయితే సామాన్యంగా ముస్లిమేతర సోదరులు మన దేశంలోని ముస్లింలను, ప్రపంచ ముస్లింలను వారి సామూహిక వ్యవస్థలు, సమాజాలు

ప్రదర్శించే జీవిత విధానాలను చూచి ఇస్లాంను గురించి ఓ అభిప్రాయాన్ని ఏర్పరుచుకుంటారు. దురదృష్టవశాత్తు ముస్లిముల వ్యక్తిగత, సామూహిక జీవితాలు ఇస్లాం సిద్ధాంతాలకు, సూత్రాలకు అనుగుణంగా లేకపోవడం మూలాన ఇస్లాం పేరు వినగానే ఇతరులు ఇస్లామ్‌ను గురించి ఇక తెలుసుకునేదేమిటి? ప్రస్తుతం ముస్లింల నడవడిక మనకు కనబడటం లేదా? దాన్ని గురించి ఆలోచించి లాభం ఏమిటి అని అనుకుంటున్నారు. కాని మిత్రులారా! నేను ఇస్లాంను గురించి చెప్పే విషయాలు అది నా ధర్మం అవటం మూలాన, నేను ముస్లిం అయినందున మతాభిమానంతో చెప్పే మాటలు ఏమాత్రం కావు. ఇస్లాం సూత్రాలను, నియమాలను పరిశీలించి, తృప్తిపడి వాటిలో ఉన్న మానవ శ్రేయస్సును దృఢంగా నమ్మి వాటిని మీ ఎదుట పెట్టదలిచాను.

దైవ సృష్టిలోని, గాలి, నీరు, వెలుగు, వేడిమి మొదలైనవి ఒక ప్రత్యేక తెగ లేక ఒక ప్రత్యేక జాతి యొక్క సొత్తు ఏ విధంగాను కానేరవు. వీటిని సకల మానవాళి ఏ విధంగా వినియోగించుకొని లాభమొందుతూ ఉందో అదే విధంగా ఈ దైవ సూత్రాలైన ఇస్లాం సూత్రాలు కూడా ఒక ప్రత్యేక తెగకో లేక ఒక ప్రత్యేక జాతికో పరిమితమైనవి కావు. ఇవి సకల మానవాళి యొక్క సొత్తు. వాటిని ఎవరు అనుసరిస్తే వారే ప్రయోజనం పొందుతారు. అలా అనుసరించేవారే దైవ చట్టానికి విధేయులు, అంటే 'ముస్లిములు'. అలా ఆ దైవచట్టానికి విధేయత పాటించనివారు ఏ దేశంవారైనా, ఏ జాతి ప్రజలైనా "ముస్లిం"లు కాజాలరు. ఇదే ఇస్లాం బోధన. కాబట్టి ఈ దైవ సూత్రాలను పరిశీలించి వాటిని స్వీకరించి అవలంబించే హక్కు అందరికీ ఉంది.

"ఇస్లాం" ధర్మం ప్రపంచ దేశాల్లో కానవచ్చే ముస్లిముల మతమని, దివ్యఖుర్‌ఆన్ వీరి గ్రంథమని ముస్లింలు చెప్పుకోవడం, ఇతరులు దీన్ని నిజమని నమ్మడం జరుగుతోంది. కాని ఈ భావం సరయింది కాదు. ఇస్లాం

ధర్మసూత్రాలు సకల సృష్టిని సృష్టించినవాడు, పోషించేవాడు, మానవాళి నంతటినీ సమంగా ప్రేమించేవాడు, అందరి క్షేమాన్ని కోరేవాడు, అందరి స్వభావాల్ని సంపూర్ణంగా ఎరిగినవాడు అయిన దైవం మానవులకై పంపించిన మార్గదర్శక సూత్రాలు. ఈ సూత్రాల్లో ఎలాంటి పక్షపాతం లేదు. ఇవి మానవ జీవితంలోని అన్ని స్థితిగతులకు తోడ్పడతాయి. అంటే దేవుని పూజా పురస్కారాలకేగాక, వ్యక్తిగత జీవిత వ్యవహారాలు మొదలుకొని కుటుంబ జీవితం, వ్యాపార వాణిజ్య విషయాలు–అన్నిటికీ సంబంధించిన నియమాలను ప్రసాదించాడు సృష్టికర్త. అదేవిధంగా సామాజిక సంబంధాలు, రాజకీయ కార్యకలాపాలు, పరిపాలనా వ్యవహారాలు, యుద్ధం, సంధి, ఒడంబడికలు మరియు అంతర్జాతీయ సమస్యలను సయితం పరిష్కరించే సకల విధానాలను, నియమనిబంధనలను ప్రపంచంలోని సకల మానవాళిని సమదృష్టితో చూచే ఆ ప్రభువు మనకు ప్రసాదించాడు. కాని వీటిని ఒక కులం, మతం, జాతి మరియు దేశానికి సంబంధించిన సూత్రాలుగా భావించరాదు.

ఈ సందర్భంలో ఇంకో విషయం తెలియజేయడం అత్యంతవసరం– ప్రస్తుతం ప్రపంచంలో దైవికమయిన మతాల పేరిట చెలామణి అయ్యే మత ధర్మాలను పరిశీలిస్తే, కొందరు వ్యక్తిగత జీవితంలో మట్టుకే దైవభక్తి విధానాలను అవలంబించి సామాజిక జీవితం మరియు రాజకీయ వ్యవహారాలు పరిపాలనా నియమాల విషయంలో దేవుడికి ఎలాంటి సంబంధంలేదని భావించినట్లు ద్యోతకమవుతుంది. అంటే ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో సృష్టికర్తను తన దైవమని విశ్వసించి, పూజాపురస్కారాల్లో, భక్తిభావాల్లో, జననమరణాల సందర్భాల్లో శుభకార్యాల్లో ఆ దైవశాసనాలను నమ్మి వాటినే అవలంబించి ఆ నియమాలను పాటించడంలో ఏ మాత్రం లోటుపాటు జరిగినా దైవకృపకు దూరమవుతామని నమ్ముతాడు. తదనుగుణంగా

జాగ్రత్తపడుతుంటాడు. కాని ఇతర సామాజిక విషయాల్లో, పరిపాలనా వ్యవహారాల్లో మాత్రం ఆ దైవానికెలాంటి సంబంధం లేదని మానవునికే సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయని మరియు తనపై అధికారాన్ని చలాయించే మరే శక్తిలేదని, మనిషి తనకు ఇష్టమయిన సామాజిక, రాజకీయ వ్యవస్థల్ని రూపొందించుకుంటున్నాడు. ఇది ఇట్లుండగా మరి కొంతమంది ఈ ఐహిక,జీవితాన్ని, ఇందులో మానవునికి ఒసగబడిన సర్వ సౌలభ్యాలను పొందటం దోషంగా ఎంచి, అడవుల్లోను, గుహల్లోను నివసిస్తూ జీవించటమే భక్తిమోక్షాలకు మార్గమని అంటున్నారు. అలా జరగటం మూలాన్నే ఈ ప్రాపంచిక వ్యవహార రంగం అంతా, దైవద్రోహుల మరియు స్వప్రయోజన పరుల హస్తగతమయి విపరీతఘోరాలకు ఆలవాలమయిపోయింది. ఇస్లాం చూపే "శాంతి మార్గం"పైన పేర్కొన్న రెండు విధానాల్లో ఏదీ కాదు, అంటే మన సామూహిక జీవితం నుండి దైవాన్ని తొలగించటమూగాదు. మానవులు ప్రపంచాన్ని వీడి సన్యాసం పుచ్చుకొని అడవుల పాలుగావటమూ కాదు.

ఇస్లామ్ – మతం కాదు

ఇంతే కాకుండా "ఇస్లాం", ప్రస్తుతం ముస్లిముల్లో కనబడేలా పెండ్లిపెటాకులు, ఆస్తిపాస్తుల పంపకం, వారసత్వపు హక్కుల నిర్ణయం, ఇంకా పూజాపురస్కారాల వ్యవహారాల వరకు పరిమితం చేయబడిన జీవిత విధానం మాత్రం కాదు. అలా అని ధనసంపాదన విషయంలో, సాంఘిక కార్యకలాపాల్లో ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాపంచిక వ్యవహారాల్లో మితిమీరిన ఆసక్తిని, శ్రద్ధను వ్యక్తపరచే వ్యవస్థ కూడా కాదు. మేము మీకు వివరిస్తున్నది, అవలంబించడానికి ప్రయత్నిస్తున్నది, పవిత్ర ఖురాన్ గ్రంథానికి సంబంధించిన ధర్మం ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మరియు ఆయన అనుచర బృందం ఆదర్శవంతంగా తమ పవిత్ర జీవితాల్లో ఆచరించిన

ధర్మం. దైవ సమ్మతిపొంది మరియు సంపూర్ణమైన విధేయత మీదనే ఆధారపడిన ధర్మం "ఇస్లాం". ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు. ఈ ఇస్లాం వ్యవస్థకు సంబంధించిన పంచసూత్రాలను ఇప్పుడు మీ ఎదుట సవివరంగా విశదీకరిస్తాను. వీటిని శ్రద్ధగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాను.

ఇస్లామ్ అందజేసే సామూహిక సిద్ధాంతాలు :

దేవుడు ఒక్కడే

ఈ ప్రపంచానికి సర్వాధికారి ఒక్కడే అనేది ఇస్లామ్ బోధించే ప్రథమ సూత్రం. ఈ సిద్ధాంతాన్ని గ్రహించడానికి మనం మొదట తెలుసుకోవలసిన విషయం ఏమంటే, ప్రస్తుతం ప్రపంచంలోని ప్రతి దేశం, ప్రతి జాతి తనకే అధికారం కావాలని, అది ఏ సూత్రాలనయితే ప్రస్తుతం అనుసరిస్తోందో ఆ సూత్రాలను కలిగి ఉన్న సంఘానికే అధికారం వస్తే ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని వాదిస్తోంది. ప్రతి జాతి, ప్రతి దేశం తాము అవలంబించిన సూత్రాలే అత్యుత్తమమైనవని, వాటినే అనుసరిస్తే మేలు కలుగుతుందని భావిస్తూ ఉంటే ఈ భావాల విభేదాల వలన ప్రపంచంలో శాంతి ఎలా ఏర్పడుతుంది? అందుకే శాంతికి బదులు ప్రపంచంలో ఒక గొప్ప సంకటం ఏర్పడి పూర్తి ప్రపంచమే ఒక యుద్ధరంగంగా మారిపోయింది ప్రస్తుతం. ఈ సంకటమే ప్రపంచ యుద్ధాలకు కారణభూతమయింది. అలాకాక ప్రతి దేశం ప్రతి జాతి తన అధికార పిపాసను విడనాడి, ఒకే సర్వాధికారిని, ఒకే మూల ప్రభువును గుర్తించి అంగీకరిస్తే ఈ సంకటాలు సులభంగా పరిష్కరించబడతాయి. కాని ఇలాంటి సర్వాధికారం ఏ ఒక్క జాతికో లేక ఏ ప్రత్యేక వ్యక్తికో ఇస్తే సకల దోషాలు గల జాతీయత లేక నియంతృత్వం తప్పక ఏర్పడతాయి. ఆ నియంతృత్వంలోని కీడులు సైద్ధాంతికంగానే గాక ఆచరణలో కూడా ప్రస్తుతం మనం పొందుతూనే ఉన్నాం.

దేవుడే సర్వాధికారి

ఈ కారణం చేతనే "ఇస్లామ్" ఈ సర్వాధికారాలను ఏకైక సృష్టికర్త అయిన ఆ దైవానికే ఇస్తున్నది, దైవాన్నే సర్వాధికారిగా విశ్వసిస్తే ఎలాంటి హాని జరగదు. ఎవరూ ఎలాంటి పక్షపాతాన్ని పాటించలేరు. అంతేకాక, దేవుడు సకల మానవాళికి సృష్టికర్త. ఆయనే సంపూర్ణ జ్ఞానసంపన్నుడు, ఆయనే సర్వశక్తిమంతుడు. కాబట్టి సర్వాధికారాలను ఆయనకే ఇవ్వడంలో ఏ సమాజానికిగాని, ఏ దేశానికిగాని ఎలాంటి ఆక్షేపణ ఉండకూడదు.

అయితే దేవుడే రూపందాల్చి వచ్చి ఈ సర్వాధికార పీఠంపై కూర్చోలేడు కదా! మరి ఎలా? దీనికి యదార్థమైన మరియు సాధ్యమయిన మార్గం ఒక్కటే. దేవుణ్ణి సర్వాధికారిగా నమ్మి, తమ ప్రతీ చర్యను దేవుడు పరీక్షిస్తాడని, ఎలాంటి అభిమానాన్ని అవలంబించినా, ఎలాంటి చెడునడతను కలిగి ఉన్నా, ఎలాంటి స్వలాభం, గర్వం, నిరంకుశత్వాలను అవలంబించినా దేవుడు శిక్షిస్తాడనే భయభక్తులు కలవారిని, దైవాజ్ఞల్ని ఉల్లంఘించే ఎలాంటి తలంపు కూడా మనసులో రానివ్వకుండా తాము కేవలం దైవప్రతినిధులమని తలచి, దైవం ప్రసాదించిన చట్టాలను స్వయంగా అనుసరిస్తూ ఇతరులచేత అనుసరింపచేయగల మహనీయులకు పరిపాలనాధికారం ఇవ్వాలి. అలా జరిగిన రోజునే ప్రపంచం నుండి కీడు తొలగి మేలు ప్రబలుతుంది.

దైవ ప్రవక్తలు

ఈ నిత్య ఐహిక జీవితంలో మన అవసరాలను తీర్చటానికి కోటాను కోట్ల వరాలను సమకూర్చాడు మన సృష్టికర్త. అయితే మానవుడు జీవించటానికే సరిఅయిన నియమాలను చూపకుండా ఉండగలడా? అలా ఎన్నటికీ జరగదు. దైవాన్ని మరచి దైవమార్గాన్ని విడనాడిన మానవకోటికి సన్మార్గం

చూపెట్టటానికి, ప్రతి దేశంలోను, ప్రతి కాలంలోను తన సందేశహరుల్ని పంపాడు దైవం. ఈ మహనీయులే దైవ ప్రవక్తలు. దైవ ప్రవక్తలలో ఉండే కొన్ని ముఖ్య లక్షణాలను మీరు తెలుసుకోవాలి. అవి ఏమిటంటేః

1. దైవప్రవక్తలు ఏ కుటుంబంలో జన్మించినా వారు చూపే మార్గం ఏ ఒక్క తెగకూ, ఏ ఒక్క జాతికీ లేక ఏ ఒక్క దేశానికీ పరిమితమయి ఉండక సకల మానవాళి కొరకు వర్తిస్తుంది.
2. ప్రవక్తలు మానవ కోటిని దైవభక్తి, విధేయతల వైపునకే పిలుస్తారు కాని, దైవాన్ని వదలి తమ స్వంత విధేయత వైపునకు పిలువరు.
3. దైవం ప్రసాదించిన చట్టాలను ప్రవక్తలు తు.చ. తప్పకుండా తమ జీవితాల్లో ఆచరించి చూపెడతారు.
4. మానవుడు ఐహిక జీవితాన చేసిన సకల పాపపుణ్యాలకు మరణానంతరం పరలోకంలో దైవసమక్షంలో జవాబుదారుడనే యదార్థాన్ని వెల్లడించి, ఆ విశ్వాసం ఆధారంగానే ప్రజలను సన్మార్గం వైపునకు మరల్చే ప్రయత్నం చేస్తారు.
5. ప్రవక్తలు తాము చేసే కృషికి ఎలాంటి ఫలితాన్ని ఆశించకపోవడం అనేది వారి మరొక గొప్ప లక్షణం.

ఇలాంటి ప్రవక్తలకు లేక వీరిని అనుసరించే అనుచర సమాజానికి పరిపాలనాధికారం ఇస్తే ప్రపంచాన శాంతి సౌభాగ్యాలు ఏర్పడడంలో సందేహం లేదు. మరో విషయమేమంటే, ఇలాంటి ప్రభుత్వం మొత్తం ప్రపంచానికి ఒక్కటే ఉండాలనే నియమం ఏమీ లేదు. ప్రపంచాన ఎన్ని ప్రభుత్వాలుంటే అవన్నీ ఆ దేవుణ్ణే సర్వాధికారిగా ఎంచి ఆయన సూత్రాలనే, ఆయన నియమించిన చట్టాలనే అనుసరిస్తే శాంతి ఏర్పడటానికి ఇక ఎలాంటి అవాంతరం ఉండదు

మానవ ఏకత్వం

ఈ మానవ సంతతి అంతా ఒకే కుటుంబానికి చెందింది అనేది రెండవ సూత్రం. కృత్రిమమయిన జాతి, వర్గం అనే విభజనల్ని వాటిపై నున్న అభిమానాల్ని మాని, మానవులంతా పరస్పరం సోదరులన్న భావం వ్యాప్తం కావాలి. ఇలా సర్వమానవ సోదరభావం ఏర్పడినప్పుడు ఎలాంటి చిక్కు సంకటం ఏర్పడినా సులభంగా తొలగిపోతుంది. మనందరికి సర్వాధికారి దేవుడే అని నమ్మి మనం అంతా ఒకే సంతతికి సంబంధించిన సోదరులమని అనుకొని, ఈ ప్రపంచమంతా మన ఉమ్మడి సొత్తు అని అనుకున్నట్లయితే ఈ జాతీయ కీచులాటలకు అసలే తావు ఉండదు. ఇంగ్లీషువారని, జర్మన్లనీ, స్వదేశీయులని, విదేశీయులని ప్రజ్వరిల్లే వివాదాలే ఉండవు. ఇది ఇస్లామ్ చూపించే ముఖ్య సూత్రం. ఏ దేశంవారయినా, ఏ తెగకు చెందినవారయినా, ఏ జాతికి, ఏ సంతతికి చెందినవారయినా, మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతతివారే. ప్రపంచం అంతా మానవకోటి యొక్క ఉమ్మడి ధనమే. ఒక దేశంలోనో లేక ఒక గ్రామంలోనో పుట్టినంత మాత్రాన ఆ దేశమయినా, ఆ గ్రామమయినా వారొక్కరికే చెందిందనడం తప్పు. మానవ జాతిలో సత్పురుషులు మరియు దుర్మార్గులు అనే రెండే రెండు తెగలున్నాయి. ఈ విభజన అయినా ప్రపంచంలో సత్యాన్ని పెంచి, అసత్యాన్ని నశింపజేయటానికే ఉపకరించాలని ఇస్లామ్ చెపుతుంది. ఈ సూత్రం ఎంత యదార్థమయినదో న్యాయ సమ్మతమయిందో ఆలోచించండి. ఈ సూత్రాన్ని అమెరికా యూరప్ దేశస్తులేకాక మన దేశస్తులు కూడా విడనాడి కొందరు పవిత్రులు, ఇంకొందరు నీచులు అని కులాలుగా, వర్గాలుగా ఏర్పరచి మానవ ఐక్యతను భంగపర్చారు. కేవలం మెజారిటీని పొందడం కోసం మానవులంతా ఒక్కటే అనే సూత్రాన్ని అవలంబించక కేవలం దైవప్రసన్నత కోసమే దీన్ని

అవలంబిస్తే ఇది ఎంత శుభప్రదంగా పరిణమిస్తుందో తెలిసివస్తుంది. దైవభావన లేకుండా మానవులమధ్య హెచ్చుతగ్గుల విభేదాన్ని నిర్మూలించడం దుర్లభం. గాంధీజీ అంటరానితనాన్ని మనదేశం నుండి పారద్రోల ప్రయత్నం చేశారు. నేడు స్వాతంత్ర్యం తరువాత 35 ఏళ్ళు గడిచినా ఆ జాడ్యం దూరం కాలేదు.

ఒకే జీవన వ్యవస్థ

మానవకోటికి ఒకే జీవన విధానం ఉండాలనేది ఇస్లాం సూచించే మూడవ సూత్రం. అంటే ఏకైక సృష్టికర్త యొక్క ప్రజలయి, ఏకైక సంతతికి చెందిన మానవాళి అంతా తమ ప్రభువు, స్వామి అయిన దేవుడు తమకై నిర్దేశించిన ఒకే జీవన విధానాన్ని అనుసరించడం అన్నమాట. దైవం ప్రతి దేశంలోను, ప్రతి కాలంలోను మానవాళిని దైవమార్గాన నడిపించేందుకు తన ప్రవక్తలను పంపాడు. మన దేశంలో కూడా వారు ఆవిర్భవించి ఉంటారు. అయితే ప్రపంచంలోని ఇతర జాతులు తమ ప్రవక్తలు గతించిన తర్వాత వారు ప్రసాదించిన మార్గదర్శకత్వాన్ని మరచినట్లే మనం కూడా మరచి పొయ్యాము. అందుకని మన దైవం తన చివరి ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (సఅసం) ద్వారా "దివ్యఖుర్‌ఆన్‌ను మానవాళి అంతటికి అందజేశాడు. ఈ గ్రంథంలో మానవుని పూర్తి జీవితావసరాలకు కావలసిన నియమ నిబంధనలున్నాయి. ఇవి ఒక కులానికి, ఒక జాతికి లేక ఒక దేశానికి చెందినవి ఏ మాత్రం కావు. ఇవి సకల మానవాళి కొరకు, ప్రపంచం ఉన్నంత కాలం మానవులు జీవితం గడపటానికి సరిపోయే దైవాదేశాలు. ఇవి కేవలం ముస్లిములు అనిపించుకుంటున్న వారికో లేక ఫలానా అరేబియా దేశం వారికో చెందిన నియమాలు ఏ మాత్రం కావు. మనందరి ప్రభువయిన సృష్టికర్త పంపిన ఆదేశాలు. ఈ చట్టాల్ని అనుసరిస్తే ఈ ప్రపంచం అంతా ఒక కుటుంబంగా, మానవులంతా సోదరులై ఒకే ప్రభువయిన దేవుని పాలితులుగా

జీవించగలుగుతారు. ఇలా ఊహించడంలోనే ఎంతో ఆనందం ఉంటే ప్రపంచం అంతా వసుధైక కుటుంబంగా దైవాదేశాలను ఆచరించిననాడు ఎంత శాంతి ఏర్పడుతుందో ఆలోచించారా?

ఒకే ధ్యేయం

సర్వమానవాళి జీవిత ధ్యేయం కూడా ఒక్కటే అయి ఉండాలన్నది ఇస్లాం చూపే నాల్గవ సూత్రం. కొందరు తమ సంఘం యొక్క శ్రేయాన్నే తమ జీవిత ధ్యేయంగాను, కొందరు తమ దేశ శ్రేయస్సునే తమ పరమార్థంగాను, ఇంకా కొందరు దేశవిస్తీరణే తమ జీవిత లక్ష్యంగాను భావించుకోవడం మూలాన వారుచేసే ప్రయత్నాల్లో భేదం ఉండి వారి కృషిక్షేత్రాలు సయితమూ వేరై పోతున్నాయి. వివిధ నమ్మకాలు, వివిధ ఉద్దేశ్యాలుగల మానవకోటిని ఒకే ఒక కృషిరంగంలో చేర్చటం అసంభవం. ఇలాకాక మానవులంతా మనందరి సృష్టికర్త అయిన ఆ ఏకైక దైవం ప్రసన్నతను పొందడమేమన జీవిత పరమార్థంగా భావిస్తే మనందరి కృషి క్షేత్రం కూడా ఒకటే అవుతుంది. ఇదొక్కటే మానవ సంతతినంతటినీ ఒకే ఒక వేదికపైకి తెచ్చే రాచ మార్గం.

పరలోకం

ఇక అయిదవదయిన చివరి సూత్రం, పై నాల్గుసూత్రాల పర్యవసానంగా ఏర్పడినది మాత్రమే అంటే "ఒకే దైవాన్ని విశ్వసించి, ఒకే కుటుంబంగా మెలిగి, ఒకే జీవిత విధానాన్ని అనుసరించి ఆ ఒక్క దైవం ప్రసన్నత కోసమే జీవించే మానవాళికి దైవం ఈ లోకంలో ఒసగే పరిమిత శాంతియే కాక, నేడు మనకు కానరాని అపరిమితమయిన పరలోక స్వర్గజీవితం కూడా ఉందని-ఇలా చెయ్యనివారికి అపరిమితమయిన పరలోక నరకయాతన ఉందని విశ్వసించడం."

స్వర్గ నరకాలను గురించి, అచ్చటి జీవితాన్ని గురించి మనకు ప్రత్యక్షంగా తెలియకపోయినా, ప్రవక్తలుగా దైవం పంపిన ఆ మహాపురుషులు దైవజ్ఞానాన్ని పొంది మనకు ఆ పరలోక విషయాలను తెలిపారు. సత్యసంధులయిన ఆ మహాపురుషులు తెలిపారు, గనక మనం వాటిని నమ్మకపోవడానికి ఏ ఆధారమూ లేదు. వారి సత్యసంధతను వారి విరోధులే ఒప్పుకోగా మనం నమ్మకపోవడానికి కారణం కానరాదు. ఒక వ్యక్తి యొక్క జీవిత విశేషాలు మనకు ప్రత్యక్షంగా తెలియకపోయినా ఆ వ్యక్తి పట్ల చరిత్ర చెప్పే విషయాలను నమ్ముతూ ఉండగా తమ పవిత్రమయిన జీవితాన్ని మానవుల నడుమ గడిపి పరమ సత్యవంతులనిపించుకొని దైవం ఎడల భయభక్తులతో మెలిగిన ఆ మహనీయులు నేర్పిన ఇట్టి సత్యాన్ని మనం నమ్మకపోవడానికి అభ్యంతరం ఏముంటుంది?

ఇదేకాక మానవాళిని దుష్ప్రవర్తన నుండి సత్ప్రవర్తన వైపునకు మరల్చడానికి పరలోకం, స్వర్గనరకాల విశ్వాసం ఎంత తోడ్పడుతుందో ఆలోచించారా? గొప్ప గొప్ప ప్రభుత్వాలు చేసిన చట్టాలు మానవుల్లో కలిగించలేని సత్ప్రవర్తన ఈ ఒక పరలోక విశ్వాసమే కలిగిస్తుందనటంలో సందేహం లేదు.

కాబట్టి సోదరులారా! ఈ సత్యమయిన సూత్రాల ఆధారంగా నిర్మించబడ్డ సమాజం ద్వారా మానవులకు ఈ లోకాన శాంతి ప్రాప్తమయి, పరలోకాన మోక్షం సాఫల్యాలు లభిస్తాయని మా దృఢ నమ్మకం. ఇవి ఊహాగానాలు ఏ మాత్రం కావు. ఈ సూత్రాలను అవలంబించినవారు చరిత్రలో ఇది వరకే ఒక శాంతియుత వ్యక్తిగత జీవితాన్ని, సాంఘిక జీవితాన్ని, ఆపై ఒక పరిపాలనా వ్యవస్థను ఆదర్శవంతంగా నిలిపి చూపించారు. మన దేశంలోని మహాపురుషుడైన గాంధీజీ మన సామూహిక వ్యవస్థను గురించి బోధించేటప్పుడు తరచు అబూబకర్ సిద్దీఖ్, ఉమర్ ఫారూఖ్ (రఅ) గార్ల పరిపాలనా వ్యవస్థను

వారి జీవితవిధానాన్ని ఆదర్శంగా గ్రహించమని బోధించేవారు. అబూబకర్ సిద్దీఖ్(ర) అయినా, ఉమర్(ర) అయినా అవలంబించిన సూత్రాలు ఈ దైవ సూత్రాలే. ఈ సూత్రాల ఆధారంగానే అరేబియాలోని అతి మూర్ఖులయిన ప్రజల్ని ప్రపంచ నాయకులుగా తీర్చిదిద్దారు ప్రవక్త ముహమ్మద్(సఅసం). ఆ అరబ్బుల చేత ఒక శాంతియుత పరిపాలనా వ్యవస్థను స్థాపించి చూపారు. అప్పుడు విరివిగా ధనం, అధికారం హస్తగతమైనా, దైవం ఎడల భయభక్తులు గల ఒక సత్సమాజాన్ని ఆయన తయారుచేశారు. మనకంటే ఎక్కువగా పతన మయిపోయిన ఆ అరబ్బు జాతి ఈ దైవసూత్రాలు అవలంబించి వృద్ధివికాసాలు సాధించినప్పుడు మనం కూడా ఈ సూత్రాలను అవలంబించి ఎందుకు సర్వవిధాలా ప్రగతి సాధించకూడదు? ఈ సూత్రాలు అరబ్బులు లేక ముస్లింల ఆస్తి కావే! ఇవి మానవులందరి సృష్టికర్త అయిన దైవం పంపిన సూత్రాలు-ఇవి అందరికీ చెందినవి.

మానవాళిలో ఏ జాతివారయినా ఈ సూత్రాలను అవలంబించి లోకానికి మరల శాంతిని, సౌభ్రాతృత్వాన్ని చూపాలని మా ఆకాంక్ష. ఈ సందేశమే మేము సకల మానవాళికి అందజేస్తున్నాం. ఇదే జమాఅతె ఇస్లామీ హింద్ నిర్వహించే సమావేశాల ముఖ్య ఉద్దేశం. గత 35 సంవత్సరాలుగా మన దేశం యొక్క ఉత్తర దక్షిణ భాగాల్లో ప్రతి మూలలో శాంతియుతంగా సమావేశాలు జరుపుతూ మా ఈ విశ్వాసాన్ని వెల్లడిస్తున్నాము. ఇందులో ఎలాంటి ద్వేషానికిగాని, వైషమ్యానికిగాని, విచ్ఛిన్నకర ధోరణులకుగాని తావులేదు. కాబట్టి ఇతర దురభిమానాలన్ని విడనాడి విశాల హృదయంతో మా మాటలను ఆలకిస్తారని, పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.

దైవం మనందరికీ శాంతినీ సన్మార్గాన్ని చూపెట్టుగాక!

★ ★ ★